## క్లుప్తంగా

### పంచాయతీ కార్యాలయంపై టీడీపీ జెండా!



మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

వెదురుకుప్పం: పంచాయతీ కార్యాలయంపై టీడీపీ జెండా ఎగురవేసినవారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్‌ఆర్‌ సీపీ నాయకులు డిమాండ్‌ చేశారు. గొడుగుచింత పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు టీడీపీ జెండాను ఎగురవేవారు. అయితే జాతీయ జెండాను ఎగురవేసే స్తంభంపై టీడీపీ జెండాను ఎగురువేశారని వైఎస్‌ఆర్‌ సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్‌ఆర్‌ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మరకాలకుప్పం రామయ్య మాట్లాడుతూ అధికారుల చనువుతోనే గొడుగుచింత గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి దీనిపై ఓ ప్రకటనలో విమర్శించారు. జిల్లా స్టీరింగ్‌ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ సర్పంచ్‌లు చిరంజీవిరెడ్డి(వెదురుకుప్పం), పెద్దిరెడ్డి(సంతబయలు), రమేష్‌రెడ్డి(మారేపల్లె), గోవిందన్‌(పాతగుంట), నాయకులు పురంధర్‌రెడ్డి, పరందామరెడ్డి, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

### పాస్టర్‌ మృతిపై విచారణ చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు

నగరి: పాస్టర్‌ పగడాల ప్రవీణ్‌ కుమార్‌ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలని నియోజకవర్గంలోని క్రీస్తు సంఘాలు, క్రైస్తవ బోధకులు డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఉదయం బస్టాండు ప్రాంగణంలోని బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితోనే దర్యాప్తు సక్రమంగా జరగడం లేదన్నారు. సనాతన ధర్మం అని చెప్పి మతాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్‌ కళ్యాణ్‌ ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ బాబు, జై భీమ్‌ సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పవర్‌ రామచంద్ర, వైఎస్‌ఆర్‌ సీపీ ఎస్సీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌ లాల్‌, ఏపీఎల్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌, యుడీసీఎఫ్‌ అధ్యక్షుడు బొకం రమేష్‌, బీఎస్పీ జిల్లా కార్యదర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి నాగూర్‌, పాస్టర్‌ పారడైజ్‌, బహుజన ఆటో వర్కర్స్‌ యూనియన్‌ డి.చంద్రయ్య, విలియమ్స్‌ పాల్‌ రాజ్‌, మిల్టన్‌, టైటస్‌, మణి, ఎబినేషన్‌, దొరై రాజ్‌, అన్బు తదితరులు పాల్గొన్నారు.


### సీగ్రేడ్‌ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే సీగ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్‌ తెలిపారు. శనివారం ఆముదాల తమిళ మీడియం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం చేయాల్సిన బాధ్యత సంబంధిత ప్రదానోపాధ్యాయులపై ఉందని తెలిపారు. అనంతరం వెనుకబడిన పిల్లలకు అన్ని సజెక్టులో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బాబు పాల్గొన్నారు.

### సేంద్రియ ఎరువుల తయారీపై శ్రద్ధ



గ్రీన్‌ అంబాసిడర్లతో మాట్లాడుతున్న సర్పంచ్‌, అధికారులు

పాలసముద్రం: వ్యర్థ పదార్థాల్లోని పొడి, తడి చెత్తలను ఉపయోగంచుకుని ఎరువుల తయారీపై గ్రీన్‌అంబాసిడర్‌, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల విస్తరణాధికారి రమేష్‌ అన్నారు. శనివారం శ్రీకావేరి రాజుపురం పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని మండల విస్తరణాధికారి రమేష్‌, సర్పంచ్‌ గాలి మహేష్‌బాబు కలసి పరిశీలించారు. గ్రీన్‌అంబాసిడర్లతో రమేష్‌ మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను ఉపయోగించుని ఎరువులు తయారు చేసి వాటిని పంటలకు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంటలు అధిక దిగుబడి రావాలంటే రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడితే రైతుల కష్టాలు తీరుతాయని తెలిపారు. గ్రీన్‌అంబాసిడర్లు బాధ్యతగా పనిచేయాలని గ్రామాల్లో తడి, పొడి చెత్తలను సంపద సేకరణ కేంద్రాలకు తీసుకుకెళ్లి ఎరువుల తయారీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

# స్వపరిపాలనపై కన్నెర్ర

కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వం అందిస్తున్న పథకాలను నీరుగారుస్తూ ప్రజలను మోసం చేస్తోంది. ఇప్పుడు గ్రామ సచివాలయాలను నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడానికి గత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. 2 వేల జనాభాకు ఒక్క సచివాలయం చొప్పున ఏర్పాటు చేసి గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఈ వ్యవస్థను వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం తీసుకురావడంతో ఆ పార్టీకి పేరొస్తుందన్న ఉద్దేశంతో వాటిని నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అందులో భాగంగా సచివాలయాలను విలీనం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేస్తుండడంతో ప్రజలు మండిపడుతున్నారు.

– విజయపురం

- సచివాలయాలపై కూటమి కుట్రలు
- విలీనం కానున్న సచివాలయాలు
- కసరత్తులో నిమగ్నమైన అధికారులు
- ప్రజలకు దూరం కానున్న సేవలు





కోసలనగరం సచివాలయం

కూటమి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంతో సచివాలయ సేవలు ప్రజలు మరింత దూరం కానున్నాయి. ఉన్న ఊర్లలోనే సేవలు పొందే అవకాశం ఇక లేదు. వేరే ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితులు త్వరలో ఏర్పడనున్నాయి. రానున్న రోజుల్లో ప్రజలు పనులు మానుకొని సచివాలయాలకు వెళ్లి అక్కడ సిబ్బంది కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితిని తలచుకుని భయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఊర్లలోనే పనులు చేసు కొని తీరిగ్గా సచివాలయాల్లో సేవలు పొందే వాళ్లమని గుర్తు చేసుకుంటున్నారు. రైతులకు కూడా ఇది ఎంతగానో ప్రయోజనకరంగా ఉండేవి.

**కసరత్తు పూర్తి చేసిన అధికారులు**

గ్రామ స్థాయి ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాకుండా దాదాపు 530 రకాల సేవలను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా పల్లెల ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో కసరత్తు పూర్తి చేశారు. ఇప్పటికే ఎంపీడీఓలు, కార్యదర్శులు సచివాలయాల కుదింపు ఎలా చేయాలనే దానిపై విస్తృతంగా సంప్రదింపులు జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.

### సచివాలయాల కుదింపు

విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీలు, 12 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో సుమారు 118 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గత ప్రభుత్వం విజయపురం, కోసలనగరం, ఇల్లత్తూరు, శ్రీహరిపురం, సూరికాపురం, జగన్నాథపురం, పన్నూరు, బూచివానత్తం, కాళికాపురం, కేవీపురం, కలియాంబాకం, ఆలపాకంలో సచివాలయాలు ఏర్పాటు చేసింది. రూ.40 లక్షల వ్యయంతో సొంత భవనాల నిర్మాణం చేపట్టింది. ఒక్కో సచివాలయంలో వెల్ఫేర్‌ అసిస్టెంట్‌, డిజిటల్‌ అసిస్టెంట్‌, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్‌, వీఆర్‌ఓ, కార్యదర్శి, వ్యవసాయం, వెటర్నరీ, ఏఎన్‌ఎం, మహిళా పోలీస్‌ తదితరులు విధులు నిర్వర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంతో కోసలనగరం, ఇల్లత్తూరు, సూరికాపురం, బూచివానత్తం, కేవీపురం, కలియంబాకం సచివాలయాలు కనుమరుగయ్యే అవకాశం ఉండవచ్చునని కొందరు విశ్లేషకులు అంటున్నారు. ఇలా చేయడం ద్వారా ఆయా గ్రామ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనాలు నిరుపయోగంగా మారే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.

### విలీనం ప్రక్రియ విరమించుకోవాలి



“ గత ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలను నిర్మించింది. అన్ని సేవలు వాటి ద్వారా అందేవి. ఇక నుంచి సచివాలయాలను మూసేస్తారని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. అలా జరిగితే పనులు కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తుంది. విలీనం నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకుంటే మంచిది.

– కుమార్‌రెడ్డి, ఆలపాకం

### విలీనంపై కసరత్తు

విజయపురం మండలంలో 12 గ్రామ సచివాలయాలున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వాటిని కుదించడానికి కసరత్తు చేస్తున్నాం. అందులో భాగంగా 12 గ్రామ సచివాలయాలను 6 గ్రామ సచివాలయాలుగా ఏర్పాటు చేయడానికి నివేదికలను రూపొందించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూపొందించిన ఈ నివేదికల మేరకు ఏయే గ్రామ సచివాయాలు ఉంటాయో త్వరలోనే ప్రకటిస్తాం.

– రాజేంద్ర, ఎంపీడీఓ, విజయపురం

### డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్‌ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉగాది పచ్చడి చేసి పంచి పెట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ అన్నపూర్ణశారద, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ వెంకటేశ్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ మంగళగౌరి, సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్‌ భీమమోహన్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఓం శక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఓం శక్తి అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని నిశ్శింకాపురం గ్రామంలో వెలసిన ఓం శక్తి అమ్మవారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గురుస్వామి అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యిలతో వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుండి ఓం శక్తి భక్తులు పంబవాయిద్యాలతో కొత్త కుండల్లో పొంగళ్లు తీసుకొచ్చి అమ్మవారి ఆలయానికి ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి పూజల్లో భక్తులకు పంచామృతం, తీర్థ ప్రసాదాలు అందించారు.

# అధికారులపై ఫిర్యాదు చేస్తాం



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు భారతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

గంగాధరనెల్లూరు: వ్యవసాయ శాఖలోని ఓ అధికారి టీడీపీ నాయకులు చెప్తేనే పనులు చేస్తామంటూ చేసిన వ్యాఖ్యలపై సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు భారతి మండిపడ్డారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాపిరెడ్డిపల్లి ఎంపీటీసీ భారతి మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారి టీడీపీ వర్గీయులు చెప్తేనే పనులు చేస్తామనడంపై మండిపడ్డారు. సదరు అధికారిపై కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని సభాధ్యక్షురాలు అనితకి తెలిపారు. పాపిరెడ్డిపల్లిలో పాఠశాల మైదానంలో క్రికెట్‌ పేరుతో అసాంఘిక కార్యక్రమాలు, క్రికెట్‌ బెట్టింగ్‌ జరుగుతోందని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. జీడీ నెల్లూరు సర్పంచ్‌ సుబ్రహ్మణ్యం యాదవ్‌ మాట్లాడుతూ గత మాసంలో సీఎం పర్యటన ఏర్పాట్ల బిల్లులను త్వరితగతన మంజూరు చేయాలని కోరారు. కట్టకిందపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి విద్యుదాఘాతంతో మృతిచెందాడని, పీహెచ్‌సీలో వైద్యాధికారుల లేకపోవడంతో ఈ ఘటన జరిగిందని తెలిపారు. వెజ్జుపల్లి సర్పంచ్‌ హరి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీ పరిధిలో దళితవాడలలో విద్యుత్‌ కేబుల్‌ వైరు మార్చమని గత నాలుగు సంవత్సరాలుగా అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీడీఓ కార్యలయం మీటింగ్‌ హాలు పైభాగం పెచ్చులూడిపోయి సభ్యులపై పడే ప్రమాదం ఎక్కువగా ఉందని త్వరితగతన నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. సభకు రాని అధికారులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ తెలిపారు. ఎంపీపీ అనిత, వైస్‌ ఎంపీపీలు హరిబాబు, బేబీ, ఎంపీడీఓ హరి ప్రసాద్‌రెడ్డి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ అత్యుత్సాహం



నడిరోడ్డుపై కేకును కట్‌ చేస్తున్న ఎమ్మెల్యే థామస్‌



భారీగా ట్రాఫిక్‌ జామ్‌

గంగాధరనెల్లూరు: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలలో భాగంగా శనివారం టీడీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై స్థానిక ఎమ్మెల్యే థామస్‌ చేతుల మీదుగా కేకులు కట్‌ చేసి బాణా సంచా పేల్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నడిరోడ్డుపై తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిపి కేకును కట్‌ చేయడంతో రోడ్డుకి ఇరువైపులా భారీగా ట్రాఫిక్‌ ఆగిపోయింది. వివిధ వాహనాలలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండే ఎండలో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్‌ జామ్‌తో వాహనాలు నడిపే డ్రైవర్లు, ప్రయాణికులు మండిపడ్డారు.

### నగరి మెప్మా సిబ్బందికి రివార్డులు



రివార్డులు చూపుతున్న మున్సిపల్‌ కమిషనర్‌, మెప్మా సభ్యులు

నగరి: ఆన్‌లైన్‌ నెట్‌వర్క్‌ ఫర్‌ డిజిటల్‌ కామర్స్‌ ప్లాట్‌ఫామ్‌లో ఒకే రోజు 597 వస్తువుల క్రయవిక్రయాలకు మెప్మా సిబ్బందికి రివార్డు దక్కింది. శనివారం మున్సిపల్‌ కమిషనర్‌ కృష్ణారెడ్డి తన ఛాంబర్‌లో వారికి రివార్డులు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌ నెట్‌వర్క్‌ ఫర్‌ డిజిటల్‌ కామర్స్‌ ప్లాట్‌ఫామ్‌ ద్వారా మార్చి 08న ఒకేరోజు లక్ష వస్తువులు కొనుగోలు చేసినందుకు రాష్ట్రానికి గిన్నిస్‌ వరల్డ్‌ రికార్డు దక్కిందని అందులో భాగంగా దానికి సహరించిన మెప్మా సిబ్బందికి రివార్డులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్‌ మేనేజర్‌ ఎస్‌.ప్రసాద్‌, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎమ్‌.స్వరూప, ఎస్‌.హిమబిందు, కె.లావణ్య, వార్డ్‌ రీసోర్స్‌ పర్సన్లు, పట్టణ సమాఖ్య ఓబీలు, టీఎల్‌ఎఫ్‌ఆర్పీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### అక్రమాలపై ఉక్కుపాదం



డ్రోన్‌ ఫ్లై చేస్తున్న డీఎస్పీ

కార్వేటినగరం: అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపేందుకు సాంకేతిక పరికరాలు ఎంతో అవసరమని నగరి డీఎస్పీ సయద్‌ మహ్మద్‌ అజీజ్‌ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ట్రాఫిక్‌ ఉల్లంఘనపై డ్రోన్‌ ఫ్లై ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు డ్రోన్‌లు ఎంతో దోహదపడుతాయన్నారు. డ్రోన్‌ సహాయంతో పేకాట స్థావరాలు, సారా తయారీ స్థావరాలను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. పట్టణాల్లో ప్రధానంగా పట్టి పీడిస్తున్న ట్రాఫింక్‌ నిబంధనల ఉల్లంఘనపై ఎప్పటికప్పుడు నిఘాపెట్టి ఈ చలానా వేయడానికి డ్రోన్‌ ఫ్లైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, త్వరలో వాహన చోదకులు, సారా తయారీదారులు, అక్రమ వ్యాపారాలు నిర్వహించే వారి భరతం పట్టేందుకు పోలీస్‌ శాఖ సీసీ కెమెరాలే కాకుండా డ్రోన్‌లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. బాలికలు, మహిళలతో అసభ్యకరంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత నేరాలకు దూరంగా ఉండాలని, అనవసరమైన కేసుల్లో చిక్కి జీవితాలను అంధకారం చేసుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

### దేశమ్మ ఆలయ హుండీ లెక్కింపు

నగరి: శ్రీదేశమ్మ అమ్మవారి హుండీలను శనివారం లెక్కించారు. ఆరు నెలల పాటు హుండీలో పోగైన కానుకలు లెక్కించగా రూ.5,94,370 ఉన్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లత తెలిపారు. ఈ లెక్కింపులో ఇన్‌స్పెక్టర్‌ మునిశేఖర్‌, భక్తులు మురళి రెడ్డి, మదన్‌కుమార్‌, అర్చకులు నీలకంఠం, గుణశేఖర్‌, చెంచయ్య, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం

– ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి జానకి





మాట్లాడుతున్న జడ్జి జానకి, సదస్సులో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పుత్తూరు: 18 ఏళ్లలోపు పిల్లలందరికీ పోక్సో చట్టంపై అవగాహన అవసరమని ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి సి.జానకి అన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్‌ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడికి పాల్పడితే 10 నుంచి 20 ఏళ్ల లేదా జీవిత కాలం శిక్ష పడే అవకాశం ఉందని వెల్లడించారు. లైంగిక దాడులు ఎక్కువైన నేపథ్యంలో పోక్సో చట్టం అమలులోకి వచ్చిందన్నారు. టీచర్లు, తల్లిదండ్రులు పిల్లలకు గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పిల్లలకు తమ సన్నిహితులు, బంధువుల వద్ద జాగ్రత్తగా మెలగాలని సూచించాలన్నారు. పోక్సో చట్టంలో నిందితుడే తాను నేరం చేయలేదని నిరూపించుకోవాల్సి ఉందన్నారు. పోక్సో కేసులను విచారించడానికి చిత్తూరులో ప్రత్యేక న్యాయస్థానం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ సంధ్య, సూపర్‌వైజర్లు గీతాంజలి, టాటా ట్రస్ట్‌ కోఆర్డినేటర్‌ సంతోషి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం పోరాటం

- ఏర్పాటు కోసం 52 కుటుంబాలు సిద్ధం
- ఒప్పుకోని ఒకే కుటుంబం
- అధికారులను ఆశ్రయించిన ప్రజలు



తహశీల్దార్‌ కార్యాలయం వద్ద నిరసన

పుత్తూరు: పట్టణ పరిధిలోని కట్టకింద రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ప్రజలంతా ఏకతాటిపై నిలబడి శ్మశానానికి దారి ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. అయితే గ్రామానికి చెందిన ఓ కుటుంబం మాత్రం వ్యతిరేకిస్తుండడంతో గ్రామస్తులంతా శనివారం పోలీసులను ఆశ్రయించారు. గ్రామస్థుల కథనం మేరకు.. కట్టకింద రామకృష్ణాపురం గ్రామానికి ఆది నుంచి శ్మశానానికి వెళ్లడానికి దారి లేక అందరూ ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును ఎలాగైనా ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులంతా కలిసి తమ పట్టా భూముల నుంచి కొంత భూమిని వదులుకున్నారు. దీంతో 2 కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా అందరూ తమ భూముల వద్ద కొంత భాగాన్ని వదులుతూ వచ్చారు. ఓ వ్యక్తి మాత్రం తన భూమిని వదలడానికి నిరాకరించాడు. ఈ నేపథ్యంలో శనివారం గ్రామ పెద్దలంతా కలిసి ఆ వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి గ్రామం కోసం భూమిని వదలాలని ప్రాధేయపడ్డారు. అయితే ఆయన, అతని కుటుంబ సభ్యులంతా బెదిరించడంతో గ్రామస్తులంతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామానికి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్‌ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి.మురగేశ్‌రెడ్డి, కె.ఏలుమలైరెడ్డి, పి.సుబ్రమణ్యంరెడ్డి, మీనలమ్మ, లక్ష్మీ, గౌరమ్మ, వసంతమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులపై జవాబుదారీతనం అవసరం

బంగారుపాళెం: ఉపాధి హామీ పథకం ద్వారా జరిగే పనులపై క్షేత్ర స్థాయి నుంచి సిబ్బంది జవాబు దారీతనంగా పనిచేయాలని పీడీ రవికుమార్‌ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో 2023–24 సంవత్సరానికి గాను పంచాయతీ రాజ్‌ కింద రూ 8,61,91,703 ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ పనులకు సంబంధించి, సామాజిక తనిఖీ బృందం ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో పనులను తనిఖీ చేశారని తెలిపారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



లెనిషా కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీపీ

కార్వేటినగరం: మండల పరిధిలోని కొటార్వేడు గ్రామానికి చెందిన లెనిషా(47) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎంపీపీ లతబాలాజీ గ్రామానికి వెళ్లి ఆమెకు నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. అదే విధంగా మేజర్‌ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని విజయమాంబాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు మార్కొండయ్య తండ్రి రామస్వామి కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ వెంట సర్పంచ్‌ శీలారాణి, ఎంపీటీసీ మురగయ్య, వైఎస్‌ఆర్‌ సీపీ నాయకులు పురుషోత్తంరాజు, లోకనాథనాయుడు, కో–ఆప్షన్‌ మెంబర్‌ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మురగయ్య, జేమ్స్‌, రమేష్‌, బుజ్జి, స్టీఫెన్‌, ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌ లోడ్‌ పెంపునకు రాయితీ

- అధిక లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ
- లోడు పెంచుకునేందుకు జూన్‌ 30 వరకు గడువు
- అవకాశాన్ని వినియోగించుకోండి: ఏడీ శంకరయ్య

వడమాలపేట (విజయపురం): ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఏసీ, ఫ్రిజ్‌, వాషింగ్‌ మిషన్‌ వాడకం సామాన్యమైపోయింది. దీంతో ఇంటికి వస్తున్న విద్యుత్‌ సరిపోక తరచూ విద్యుత్‌ సమస్యలు వస్తుంటుంది. ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి విద్యుత్‌ అధికారులు వినియోగదారులకు వెలుసుబాటు కల్పిస్తున్నారు. విద్యుత్‌ కిలోవాట్స్‌ పెంచుకోవడానికి 50 శాతం రాయితీ అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌ శాఖ అధికారులు సూచించారు. ఈ ఏడాది జూన్‌ 30 వరకు ఈ అవకాశం ఉంటుందని, గడువు ముగిసిన తర్వాత అధికారులే వచ్చి తనిఖీ నిర్వహిస్తే పూర్తి మొత్తం చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. గత పది సంవత్సరాలతో పోల్చితే విద్యుత్‌ వాడకం ఇప్పుడు మూడింతలు పెరగడంతో నాణ్యమైన విద్యుత్‌ అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫ్యాన్ల స్థానంలో ఏసీలు, వేడినీటికి హీటర్లు, దుస్తులు ఉతికేందుకు వాషింగ్‌ మిషన్లు సర్వసాధారణమయ్యాయి.



విజయపురం విద్యుత్‌ సబ్‌స్టేషన్‌

**విద్యుత్‌ సమస్యలు దూరం**

ప్రస్తుతం గృహ విద్యుత్‌ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు దాదాపు సగం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్‌ అధికారులు తెలిపారు. గృహ విద్యుత్‌ అవసరాలకు కనెక్షన్‌ ఇచ్చే సమయంలో వాడే లైట్లు, గృహోపకరణాల అవసరాలను అంచనా వేసి కిలోవాట్స్‌ లెక్కన డెవలప్‌మెంట్‌ ఛార్జి, సెక్యూరిటీ డిపాజిట్‌ కట్టించుకునేవారు. దాని కంటే ఎక్కువగా వినియోగదారుల వాడకం పెరిగింది. అధికంగా విద్యుత్‌ పరికరాల వాడకంతో తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన పరికరాలు తరచూ ట్రిప్‌ అయి విద్యుత్‌ సమస్యలు తలెత్తుతున్నాయి. వినియోగదారులు కూడా తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి లోడు పెంచుకోవడం కోసం 50శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమ మార్గమని అధికారులు సూచిస్తున్నారు.

**క్రమబద్ధీకరణకు ఇచ్చే రాయితీ వివరాలు**

| అదనపు లోడు (కిలోవాట్‌) | అసలు ధర | తగ్గింపు ధర |
|---|---|---|
| 1 | రూ. 2250 | రూ. 1250 |
| 2 | రూ. 4450 | రూ. 2450 |
| 3 | రూ. 6650 | రూ. 3850 |
| 4 | రూ. 8850 | రూ. 4450 |

**50 శాతం రాయితీ ఇస్తున్నాం**



అధిక లోడు వాడుతున్న గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తున్నాం. విద్యుత్‌ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జూన్‌ 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉంది. పూర్తి వివరాలు కావాలంటే సమీప లైన్‌మెన్‌ను సంప్రదించాలి.

– శంకరయ్య, ఏపీఎస్పీడీసీఎల్‌ ఏడీ, పుత్తూరు